# బొమ్మ పిస్తోలుతో బ్యాంకు దోపిడి

1979 జనవరి 31వ తేదీన పార్కు సమీపంలో జరిగిన జంట హత్యలు మొత్తం కాన్పూర్ ప్రజల్లో భయాందోళనలు కలుగ చేసాయి. రెండు నెలలు అయినా హంతకుడు ఎవరో పోలీసులు కనుగొనలేక పోయారు. క్రొత్తగా పెళ్లి చేసుకొన్న ధనవంతుల బిడ్డల్ని వారి వద్ద ఉన్న నగల కోసం, కొంత నగదు కోసం హంతకుడు చంపివేయడంపై ఆ పట్టణ ప్రజలలో భయం పెరిగింది. హంతకుడు ఫలానా అని పోలీసులు చెప్పలేక పోయారు. పైగా చాలా మందిని అనుమానం మీద అరెస్టు చేసి ఇంటరాగేషన్ చేసి చివరకి వదిలేయసాగారు.

ఈ తరహా అనుమానితుడిగా అరెస్టు కాబడ్డ నఫీజుద్దీన్ అనే పాతికేళ్ల నిరుద్యోగిని పోలీసులు వలవేసి మరీ పట్టుకున్నారు. హత్య కావింపబడ్డ ప్రేమికుల ప్రేమాయాణంలో కొంత కాలం మధ్యవర్తిత్వం చేసి మధ్యలో వారితో కుదరక విరమించుకోడం వరకు నఫీజుద్దీన్ పాత్రకాగా, ఆ కుదరకపోవడమే పోలీసులకు అనుమానం కొండంత అయ్యింది. ఇది ముమ్మాటికి పాత పగతో కసితో చేసిన హత్యలుగా పోలీసులు కథనాన్ని చక్కగా అల్లేశారు.

అరెస్టు చేసి తీసుకురాబడ్డ నఫీజుద్దీన్‌ను హంతకుడు అని చెప్పడానికి సినిమా టైపులో క్వాలిటీస్ పుష్కళంగా ఉన్నాయి . ఆరడగుల విగ్రహం విశాలమైన ఛాతీ, తీక్షణమైన కళ్ళు, ఉంగరాల జుట్టు, పైగా ఆర్థికంగా బాగా వెనుకబడడం అతని వెనుక పెద్దగా ఎవరూ లేకపోవడం పోలీసులకు అన్ని విధాలుగా కలిసి వచ్చింది.

“ఏరా! ఎందుకు ఆ ఇద్దర్ని చంపావు. నీ ఫింగర్ ప్రింట్స్, చంపుతుండగా నిన్ను చూసిన సాక్షులు వలన నీవు హంతకుడివి అని ఇట్టే తేలిపోయింది. కనుక నిజం అంగీకరించు. లేకుంటే నీ చర్మం వొలిచి నిజం చెప్పిస్తాం”అని ఇన్‌స్పెక్టర్ ఉరిమాడు.

ఇంతవరకు చిన్న నేరం కూడా చేయని నఫీజుద్దీన్‌కు పోలీసుల భాష హెచ్చరిక, నేరం ఒప్పుకోమనే ధోరణితో చాలా బాధ అనిపించింది. అతడెంత చెప్పినా కనీసం ఒక్క మాట వినరు. సరికదా హంతకుడిగా ఒప్పేసుకుని లాఠీలకు పని కల్పించకు అని చెప్పడంతో మరింత కృంగిపోయాడు.

తాను చదువుకున్న డిగ్రీ చివరికి ఈ ఆకలి భారతదేశంలో ఆకలి తీర్చకపోగా, లేని నేరం మోపి సంఘంలో నేరస్థుడిగా మార్చి బ్రతకమంటోంది. తాను చదువుకుంటున్నప్పుడు భవిషత్ జీవితంపై ఎన్నో కలలుగన్నాడు. ఆ కలలు ఈనాడు కల్లలుగా మిగిలాయి అని గట్టిగా కళ్లు మూసుకున్నాడు. కనుకొలుకుల్లోంచి నాలుగు వెచ్చని కన్నీటి బొట్లు చెంపల మీదకు జారాయి.

“ఏంబే సూపర్ ఏక్టన్ అంతా మూగగా అభినయిస్తున్నావు. ఒప్పుకుంటావా కమ్మకోమంటావా” అని ఒక పోలీసు ఫట్‌మని డొక్కలో తన్నాడు. ఎగిరి పడ్డాడు నఫీజుద్దీన్. గోడకు తల కొట్టుకుని కళ్ల ముందు మెరుపులు మెరిశాయి. ఆపైన పోలీసుల బూట్లు క్రింద నజ్జు నజ్జు అయ్యాడు. స్పృహ తప్పాక సెల్ లోకి విసిరేసి చేతులు దులుపుకున్నారు.

మరుసటి దినం సెల్ లోపల ఒక మూలగా గోడకు చేరగిలబడి ఉన్న నఫీజుద్దీన్‌కు “రేయ్ నీ నిర్వాకం ఫోటోతో సహా వచ్చిందిరా” అని దినపత్రిక ఒకటి చూపించాడు ఒక కానిస్టేబుల్. అప్పటి వరకు ఒళ్లంతా పచ్చిపుండు అయినందున విపరీతంగా బాధపడ్తూ కదల వీలుకాని పరిస్థితులో అతికష్టం మీద గోడకు చేరగిలబడి ఉన్నాడు. వార్త వచ్చిందని వినడంతో తన ప్రక్కలో ఏదో బాంబు పేలినట్లుగా ఫీలయి కటకటాల్లోంచి ఆ దినపత్రిక అందుకున్నాడు.

తన ఫోటో ప్రచురింపబడినది. పాత కక్షతో ప్రేమికుల్ని మట్టుబెట్టిన హంతకుడు అని పెద్ద హెడ్డింగులతో వచ్చిన ఆ వార్తను చదివి నఫీజుద్దీన్ విపరీతంగా రోదించాడు. గోడకేసి తల బాదుకున్నాడు. తల పగిలి రక్తం వచ్చింది. అంత వరకు అతడే హంతకుడు అని గట్టిగా నిర్ణయానికి వచ్చిన పోలీసులు అతన్ని చూసి తొలిసారి భయపడ్డారు. సెల్ లోకి వెళ్లి అతన్ని అదుపులోకి తిసుకున్నారు. “నేను చావాలి. నా చదువు నా భవిషత్ అంతా నాశనం అయ్యింది” అంటూ పెడబొబ్బలు పెట్టాడు.

ఇన్‌స్పెక్టర్ పోలీసుల ఎస్కార్ట్‌తో నఫీజుద్దీన్‌ను హాస్పిటల్‌కు పంపేసాడు. తరువాత బాగా ఆలోచించి వీడు హంతకుడుగా పనికిరాడు. కోర్టులో తను నిరూపించుకోలేని పరిస్థితి ఉంది. నఫీజుద్దీన్ హాస్పిటల్ నుంచి అటే వదిలేసారు.

★ ★ ★

నఫీజుద్దీన్‌ను వదిలేసినట్లు అతడు నిర్దోషి అని పత్రికలకు ఎలాంటి సమాచారం ఇన్‌స్పెక్టర్ ఇవ్వలేదు. అతన్ని కోర్టులో హంతకుడిగా నిలబెట్టి ఉంటే తాను నిరూపించుకోలేని పరిస్థితి ఉంది. ఫింగర్ ప్రింట్స్ టాలీ కావడం లేదు. నఫీజుద్దీన్ చాలా సెన్సెటివ్‌లా కన్పిస్తున్నాడు. జైలులో తల గోడకు కొట్టుకుని చచ్చేరకంగా ఉండడంతో వదిలేసాడు.

నఫీజుద్దీన్ నివసించే ఏరియాలో అతన్ని ఒక హంతకుడిగా ప్రజలు చూడసాగారు. భయంకరమైన వ్యక్తిగా ముద్రపడి పోయి రోడ్డుపై తిరుగాడటమే చాలా కష్టం అయ్యింది.

ఫిబ్రవరి 18వ తేదీ వరకు ఎలాగో గడిపాడు. తన మట్టు ప్రక్కల వాళ్ల సూటిపోటి మాటలకు అతనిలో అంత వరకు లేని రాక్షసుడు ఒక్కసారి విజృంభించాడు. దాని పర్యవసనమే సిటీకి పరిమితమైన ఒక హిందీ దినపత్రికలో ఒక ఎడ్వర్‌టైజ్‌మెంట్ వేయించాడు.

రివాల్వర్ లేదా హ్యాండ్‌గన్ కావాలి అని తన అడ్రసుతో వేయించాడు. అమ్మగల వ్యక్తులు వారం రోజుల్లోగా తెలుపవల్సిందిగా కోరాడు. ఆ ప్రకటన చదివిన ఆ కాలనీ వాసులు మరింత భయపడ్డారు. డైరెక్టుగా గల్లీలోకి దిగిపోతున్నాడు. ఇంక ఎందర్ని చంపుతాడు అని.

వారం తరువాత మరో ఎడ్వర్‌టైజ్‌మెంట్ వెలువడింది. రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ చటర్జీ నుంచి రివాల్వర్ కొనుగోలు చేసినట్లుంది. ఈ ప్రకటన ఆ కాలనీలో ఎలాంటి భయాందోళనలు కలుగ

యర్నాగుల సుధాకర రావు

వేసిందో అంతకు మించి ఆ పరిధిలో గల పోలీసు తాణాను కుదిపేసింది.

నఫీజుద్దీన్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చారు. ఇన్‌స్పెక్టర్ గుర్రుగా చూస్తూ "ఏరా లోగడ నిన్ను హంతకుడిగా అరెస్టు చేసాను. నీ సెన్సెటివ్‌ను చూసాక వదిలేసాను. కానీ, ఆ రోజు మా ఊహ కరెక్టు. నీవు క్రిమినల్‌వి. నీకు రివాల్వర్ ఎందుకు? ఎవడ్ని చంపడానికి" అంటూ నిగ్గదీసాడు.

తనకేమీ తెలీదు అని చెప్పాడు నఫీజుద్దీన్.

"మరి పత్రికలో ప్రకటనలు" అంటూ పత్రికలు ముఖాన కొట్టాడు.

ఆత్రంగా చదివి "నేను ఇప్పుడు చూస్తున్నాను. అంతా అయోమయంగా వుంది. అప్పుడు హంతకుడు అని మీరే ముద్ర వేసారు. ఇప్పుడు రివాల్వర్ కొనుగోలుదారుగా ప్రకటన మీరే వేసారు అని నఫీజుద్దీన్ కోపం ప్రదర్శించాడు.




ఇన్‌స్పెక్టర్ తల పట్టుకున్నాడు. పత్రికాఫీసులో ఈ ప్రకటన వేయించన వాడు ఒక ముదుసలి అని అతడిచ్చిన ఫ్రమ్ అడ్రస్ ఎంత వెదికినా లభించలేదని తేలింది. అలాగే రివాల్వర్ అమ్మిన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ చటర్జీ అనే వ్యక్తి అసలు కాన్పూర్‌లో లేడు. మొత్తం ప్రకటన ఫాల్స్ అని తేలిపోయింది.

"ఇక నువ్వు వెళ్లొచ్చు" అని కసిరి పొమ్మన్నాడు ఇన్‌స్పెక్టర్. నఫీజుద్దీన్ రెండవసారి ఆ ఠాణా లోంచి వచ్చేసాడు.

★ ★ ★

ఫిబ్రవరి 28 వ తేదిన నఫీజుద్దీన్ తను నివాసముంటున్న వీధిలో గల బ్యాంకులోకి మధ్యాహ్నం మూడు గంటలకు జొరబడి రివాల్వర్ చూపించాడు. లోపల కష్టమర్లు ఎవరూ లేరు. షట్టర్ బలవంతంగా దింపించి బ్యాంకు ఉద్యోగులందర్ని ఒక గదిలోకి నెట్టేసి తలుపు మూసాడు. అప్పటికి కేవలం పన్నెండు మంది ఉద్యోగులే ఉన్నారు. మిగిలిన ముప్పయిమంది మధ్యాన్నం భోజనానికి ఎదురుగా ఉన్న హోటల్ గదిలోకి వెళ్లారు. తాము తెచ్చుకున్న కేరియర్లతో ఆ హోటల్‌కి వెళ్లడం ఆ శాఖ ఉద్యోగులకు అలవాటు.

ఐరన్ సేఫ్‌లో విలువైన బంగారు నగలు, కరెన్సీ మొత్తం నలభై లక్షలు దోచుకుని నఫీజుద్దీన్ రెగ్యులర్ కష్టమర్‌లా బ్యాంకులోంచి వెళ్లిపోయాడు.

క్షణాల్లో బ్యాంకు దోపిడీ గురించి నగరం అంతా వ్యాపించింది. పోలీసులు రంగ ప్రవేశం చేసారు. నఫీజుద్దీన్ వెళ్లిపోతూ ఒక ఉత్తరం విడిచి మరీ వెళ్లాడు. అందులో ఇలా ఉంది.

నేను అందరిలా చదువుకుని దేశానికి ఒక బాధ్యత గల వ్యక్తిగా సేవలు అందించాలనుకున్నాను. కానీ, ఈ అవినీతి భారతావనిలో నన్ను పోలీసులే నేరస్థునిగా ముద్రవేసారు. నన్ను సంఘం దోషిగా, రాక్షసునిగా వేలెత్తి చూపింది. ఇక నా మార్గం ఇదేననిపించి నన్ను హేళన చేసే నా నివాసంకు చేరువులో ఉండే బ్యాంకు సిబ్బంది కళ్లు బైర్లు కమ్మేట్టు దోపిడీ చేసాను. ఈ భారతావనిలో న్యాయం, ధర్మం చచ్చిపోయింది. అవినీతి, దోపిడికి విజయం వరిస్తోంది. అందుకు చక్కని ఉదాహరణ నేనే. అని నఫీజుద్దీన్ వివరించాడు.

పోలీసులు కళ్లల్లో వత్తులు పెట్టుకుని గాలించారు. నఫీజుద్దీన్ జాడ లేదు. అతడిలో నేరస్థుడికి బీజం వేసింది పోలీసులే అయినా, ఆ నేరస్థుడికి చక్కని తెలివి తేటలుతో పెంచింది నఫీజుద్దీన్. అందుకే ఒంటరిగా బ్యాంకు దోచాడు. ఆ వెంటనే దొరక్కుండా పలాయనం చిత్తగించాడు.

హంతకుడు ముద్రపడ్డాక తన చుట్టూ ఉన్న వాళ్ల చూపులు, మాటలు భరించలేక పోయాడు. అందుకే రివాల్వర్ కావాలి అని ప్రకటనను ఇప్పించి మరింతగా సంఘంలో తనంటే భయం కల్పించాడు. ఆ ప్రకటనలు కూడా కిరాయికి ఒక వృద్ధునిచే ఇప్పించాడు. తీరా బ్యాంకు దోపిడీకి వినియోగించే రివాల్వర్ పిల్లలాడుకునేది. ఆ ఖాళీ పిస్తోలుతో ఖజానా ఖాళీ చేసేసాడు.

నాటి నుంచి నేటి వరకు నఫీజుద్దీన్ జాడ కాన్పూర్ పోలీసులు కనుగొనలేకపోయారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నఫీజుద్దీన్‌ను పట్టుకోవడానికి పెద్ద మొత్తంలో నగదు బహుమతి ప్రకటించింది.

●